


**ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే..**
మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గు చేటని డీసీసీ అధ్యక్షుడు అన్నారు.
- 8లో ▸



**మహిమాన్విత క్షేత్రం**
డొంకేశ్వర్ మండలం దత్తాపూర్‌లో కొలువైన శివదత్త ఆలయం మహిమాన్విత క్షేత్రంగా వెలుగొందుతోంది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.4 /20.8

**వాతావరణం**
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం



**ఖలీల్‌వాడి:** అవినీతి రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని జిల్లా జడ్జి, న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. అవినీతి నిరోధక శాఖ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు జిల్లా కోర్టులోని సమావేశ హాల్‌లో శనివారం బహుమతులు అందజేశారు. సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి మాట్లాడుతూ లంచాలు ఇవ్వడం, తీసుకోవడం రెండూ నేరమే అన్నారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ అవినీతిని రూపుమాపడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన కాకతీయ ఒలింపియాడ్ విద్యార్థులు ఉమాశ్రీ, అక్షర, దుబ్బ పాఠశాల విద్యార్థి అక్షరకు బహుమతులు అందజేశారు. ఏసీబీకి సహకరించిన జిమ్ శ్రీనివాస్‌రెడ్డి, అర్వింద్‌కు ప్రశంస పత్రాలు అందించారు.

### చదువుతో పాటు ఆటల్లో రాణించాలి



**ఆర్మూర్ టౌన్:** విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సూచించారు. ఆర్మూర్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–17 పోటీలు ప్రారంభమయ్యాయి. డీఈవో హాజరై పోటీలను ప్రారంభించారు. క్రీడలు ఆడితే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతి విద్యార్థి తనకు నచ్చిన క్రీడల్లో తప్పనిసరిగా ప్రతిరోజు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో గంగారాం, హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాకు ఏడు 108 వాహనాలు

**నిజామాబాద్ నాగారం:** జిల్లాకు కొత్తగా 108 అంబులెన్స్ వాహనాలు మంజూరయ్యాయని డీఎంహెచ్‌వో రాజశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ధర్పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి, రుద్రూర్, ఎడపల్లి, పోతంగల్, సాలూర మండలాలకు వీటిని కేటాయించారు.

### పూర్తికావొస్తున్న సర్వే డాటా ఎంట్రీ

**నిజామాబాద్ సిటీ:** సమగ్ర సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు జిల్లావ్యాప్తంగా దాదాపు పూర్తికావొచ్చింది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 91.34శాతం పూర్తయినట్లు అధికారులు శనివారం తెలిపారు. బోధన్‌లో 98.61శాతం, భీంగల్‌లో 86.88 శాతం పూర్తిచేశారు.ఆర్మూర్ మున్సిపాలిటీలో 100 శాతం డాటా ఎంట్రీ పూర్తయినట్లు అధికారులు నివేదికలు పంపారు.

| మున్సిపాలిటీ | మొత్తం గృహాలు | పూర్తి చేసినవి | శాతం |
|---|---|---|---|
| నిజామాబాద్ | 99,639 | 91,015 | 91.34 |
| బోధన్ | 21,878 | 21,640 | 98.61 |
| భీంగల్ | 4,849 | 4,213 | 86.88 |
| ఆర్మూర్ | 21,079 | 21,338 | 101.23 |

# ప్రజల అభ్యున్నతికి నిరంతర కృషి

బాల్కొండ నియోజకవర్గంతో పాటు జిల్లా ప్రజల అభ్యున్నతికి నిరంతరం పాటుపడతానని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్న సమయంలో జిల్లాలో, నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో చిత్తశుద్ధితో పనిచేశామన్నారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు పోరాటం చేస్తానన్నారు. ప్రతిపక్ష పాత్రలో భాగంగా జిల్లాలో అనేక కార్యక్రమాలు చేస్తూ ముందుకెళుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి 'సాక్షి' ఇంటర్వ్యూలో పలు విషయాలపై మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..



బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

■ గత ఏడాది వరకు జిల్లా, బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టించాను

- మిగిలిన పనుల కోసం పాటుపడుతున్నాను
- ప్రభుత్వ హామీలు అమలు చేసేవరకు ప్రజల పక్షాన పోరాటం
- పర్యాటకంగా ఎస్సారెస్పీని అభివృద్ధి చేస్తాం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

సాక్షి ఇంటర్వ్యూ

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** బాల్కొండ నియోజకవర్గంలో కాళేశ్వరం ప్రాజెక్టు 21వ ప్యాకేజీ కింద పంప్‌హౌస్, మెయిన్ పైప్‌లైన్ పనులు పూర్తి కాగా, డిస్ట్రిబ్యూషన్ కెనాల్ పనులు పూర్తి చేస్తే 80 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఇందుకోసం కృషి చేస్తున్నాను. భీంగల్‌లో 100 పడకల ఆస్పత్రి మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయించి పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాను. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాను. వేల్పూర్, కమ్మర్పల్లిల్లో జూనియర్ కాలేజీల కోసం ప్రతిపాదనలు చేశాను.

◆ చౌట్‌పల్లి హన్మంత్ రెడ్డి లిఫ్ట్ పైప్‌లైన్‌ను స్టీల్ పైప్ లైన్‌గా మార్చాలని ప్రతిపాదించాను. గతంతో మేము అధికారంలో ఉన్న సమయంలో మంజూరు చేసిన రోడ్లు, కులసంఘ భవనాలు, గుడులను ఈ ప్రభుత్వం రద్దు చేసింది. వీటి కోసం గట్టిగా పోరాడుతాను. గల్ఫ్ కార్మికుల కోసం మోర్తాడ్ మండల కేంద్రంలో గతంలో మేము మంజూరు చేసి టెండర్లు పూర్తి చేసిన న్యాక్ బిల్డింగ్‌ను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. ఆ పనులను ప్రారంభించాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తాను.

◆ భీంగల్ మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా మార్చి రూ.100 కోట్లతో అభివృద్ధి చేశాం. రూ.100 కోట్లతో అన్ని మండల కేంద్రాలలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశాం. సొంత నిధులు, సీఎస్‌ఆర్ ద్వారా రూ.2 కోట్లతో ప్రభుత్వ హాస్పిటల్ ఆధునీకరణ, ఆక్సిజన్ బాటిలింగ్ యూనిట్ ఏర్పాటు చేశాం.

◆ గత పదేళ్ల కాలంలో బాల్కొండ నియోజకవర్గంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రూ.1,900 కోట్లతో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం మంజూరు చేయించి పూర్తి చేశాను. ప్యాకేజ్ 21 ఏ ద్వారా నియోజకవర్గంలో 80 వేల ఎకరాలకు సాగునీరందించే పనులకు రూ.1,200 కోట్లు ఖర్చు చేశాం. పనులు కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలో 30 గ్రామాలను కలుపుతూ పారే కప్పలవాగు, పెద్దవాగు మీద రూ.200 కోట్లతో 26 చెక్‌డ్యామ్‌లను మంజూరు చేసి 20 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పూర్తి చేశాం. అదేవిధంగా రూ.100 కోట్లతో గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించాం.

◆ ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న చోట 1,200 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం, 18 చోట్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేశాం. నియోజకవర్గంలో ఆలయాలకు రూ.8 కోట్లు మంజూరు చేశాం. రూ.3 కోట్లతో మసీదులు, చర్చిల అభివృద్ధి. 20 కొత్త జీపీలు, 68 నూతన గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించాం.

◆ అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అబద్ధపు పునాదుల మీద గద్దెనెక్కింది. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేవరకు ప్రతిపక్షంలో ఉండి ప్రజల పక్షాన ప్రభుత్వం వెంటపడుతూనే ఉంటాను. ఆరు గ్యారెంటీలు, 13 హామీలు, 420 వాగ్దానాలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్నారు. ఏడాది పూర్తయినప్పటికీ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు కాలేదు. అన్నీ ఆరంభ శూరత్వమే తప్ప, క్షేత్రస్థాయిలో చూస్తే 30 శాతం కూడా అమలు కాలేదు.

◆ ఉచిత బస్సు ఒక్కటి ప్రారంభించి బస్సుల సంఖ్య తగ్గించి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు మహాలక్ష్మి ద్వారా రూ.2,500, పింఛను రూ.4 వేలు, తులం బంగారం, రైతు భరోసా, కౌలు రైతులకు భరోసా, ఉపాధి హామీ కూలీలకు రూ.12 వేలు, గృహలక్ష్మి, విద్యార్థులకు యువవికాసం తదితర పథకాలు ఇచ్చిన ఊసే లేదు. రూ.500కే వంట గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. రైతు రుణమాఫీ, రూ.500 బోనస్ అరకొరగా ఇచ్చి పూర్తి చేశామంటూ అబద్ధాలు చెబుతున్నారు. జిల్లాకు కేబినెట్ మంత్రి పదవి సైతం ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉంది. ప్రతి అంశంపై ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూనే ఉంటాం.

➡ రూ.800 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లు, వంతెనలు నిర్మించాం. రూ.200 కోట్లతో పంచాయతీ రాజ్ రోడ్లు, బ్రిడ్జిలు వేశాం. రూ.6 కోట్లతో బుస్సాపూర్ లిఫ్ట్, రూ.6.50 కోట్లతో కుకునూర్ లిఫ్ట్, రూ.11 కోట్లతో గుమ్మిర్యాల్ లిఫ్ట్ పనులు పూర్తి చేశాం. రూ.60 కోట్లతో చేపట్టిన చిట్టాపూర్ లిఫ్ట్ పనులు పురోగతిలో ఉన్నాయి. రెండు మైనారిటీ, రెండు బీసీ, ఒక ఎస్సీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేశాం. మానాలలో గిరిజన గురుకుల కళాశాల ఏర్పాటు చేశాం. బాల్కొండకు డిగ్రీ కాలేజ్ మంజూరు. లింబాద్రి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం అభివద్ధి చేశాం.

» నిజామాబాద్ వద్ద రూ.93 కోట్లతో మాధవ నగర్ ఆర్వోబీ పనులు నడుస్తున్నాయి. బోధన్ రోడ్డులో అర్సపల్లి ఆర్వోబీ మంజూరు, డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వరకు డివైడర్ సెంట్రల్ లైటింగ్ పనులు చేశాం. నిజామాబాద్ బైపాస్ రోడ్ 4 లైన్ల కోసం, నిజామాబాద్‌లో ఇతర రోడ్లకు రూ.30 కోట్లు మంజూరు చేశాం. జిల్లా కేంద్రంలో రూ.8 కోట్లతో ఎస్‌సీ శిక్షణా భవనం నిర్మించాం. జిల్లాలోని 18 మండల కేంద్రాల్లో డివైడర్, సెంట్రల్ లైటింగ్, 4 లైన్ల రోడ్డు పనులకు రూ.200 కోట్లు మంజూరు చేయించాను.

## సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**నిజామాబాద్ అర్బన్:** సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జెండా ఊపి ప్రారంభించారు. మాజీ సైనికులు, సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ఉద్దేశించిన సహాయ నిధికి విరాళం అందజేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, ఆర్మీ అధికారులు, సిబ్బంది కలెక్టర్‌కు స్వాగతం పలికి, గౌరవ వందనం సమర్పించారు. అదనపు కలెక్టర్ అంకిత్‌తో పాటు కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగులు సైనిక సంక్షేమ నిధికి విరాళాలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం సైనికులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా శ్రమిస్తున్నారన్నారు. ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి రమేష్, సిబ్బంది సులేమాన్, బదాం గంగమోహన్, ఉమేర్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి రవికాంత్, దివాకర్ రెడ్డి, గుజరాతీ మోహన్, సుజాత, సరస్వతి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాపిరెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

## ముగ్గురు పిల్లలను విక్రయించిన తల్లి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- విచారణ జరుపుతున్న పోలీసులు

**ఆర్మూర్‌టౌన్:** మొదటి భర్తకు పుట్టిన ముగ్గురు పిల్లలను కన్నతల్లే విక్రయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని మామిడిపల్లికి చెందిన భాగ్యలక్ష్మి భర్త కొంత కాలం క్రితం చనిపోగా, మరొకరిని రెండో వివాహం చేసుకుంది. ఆమెకు అప్పటికే మొదటి భర్తతో కలిగిన ఏడేళ్ల బాబు, ఐదేళ్ల వయసున్న ఇద్దరు మగ కవల పిల్లలు ఉన్నారు. రెండో భర్తతో కలిగిన మరో ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా పది నెలల క్రితం లక్ష్మి మొదటి భర్తతో జన్మించిన ముగ్గురు పిల్లలను విక్రయించింది. సుర్బిర్యాల్ గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి రూ. లక్షకు ఒక బాబును, జగిత్యాల జిల్లాకు చెందిన ఓ కుటుంబానికి రూ. 2 లక్షలకు ఒక బాబును, భీంగల్ మండలం బెజ్జోరకు చెందిన ఓ కుటుంబానికి రూ. 1.2 లక్షలకు మరో బాబును విక్రయించింది. అందిన సమాచారం మేరకు నిందితురాలు లక్ష్మిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అదే విధంగా అక్రమంగా పిల్లలను కొనుగోలు చేసిన వారిపైన కేసులు నమోదు చేశామని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం ఐసీడీఎస్ అధికారుల సంరక్షణలో విక్రయానికి గురైన ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్స్ రాక ఇబ్బందులు



నగరంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో అధికారులను ప్రశ్నిస్తున్న వినియోగదారులు

- నాలుగు ప్రాంతాల్లో లైన్ డ్యామేజ్ అయినట్లు అధికారుల వెల్లడి

**నిజామాబాద్ రూరల్:** బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్స్ రాక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం మధ్యాహ్నం నుంచి సిగ్నల్ రాకపోవడంతో జిల్లా కేంద్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయానికి పలువురు వినియోగదారులు వచ్చి అధికారులను నిలదీశారు. నాలుగు చోట్ల లైన్ డ్యామేజీ కావడంతో సిగ్నల్ రావడం లేదని బీఎస్‌ఎన్‌ఎల్ జిల్లా అడిషనల్ జనరల్ మేనేజర్ సీతారాం తెలిపారు. నిర్మల్ జిల్లా ఇచ్చోడ, డిచ్‌పల్లి–సదాశివనగర్, వర్ని–బాన్సువాడ మధ్య, బోధన్–నాందేడ్ మధ్య వివిధ పనులతో కేబుళ్లు కట్ అయినట్లు వివరించారు. లైన్లను పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కాగా రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో సిగ్నల్స్ వచ్చాయి.

## విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలి

- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్
- ముగిసిన జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

**నిజామాబాద్ అర్బన్:** విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి నూతన ఆవిష్కరణలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఇన్‌స్పైర్‌లో మొత్తం 13 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి ఎంపిక చేశామన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి గంగకిషన్, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, వాసుదేవరావు, సాయిరెడ్డి, కాంతారావు, సురేష్, నరేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల స్వైర విహారం

- ఆర్మూర్ పట్టణంలో 15 మందిపై దాడి

**ఆర్మూర్ టౌన్:** ఆర్మూర్ పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడుల చేస్తున్నాయి. కుక్కల బెడదతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం రాత్రి వీధి కుక్కల దాడిలో 15 మంది గాయాలపాలయ్యారు. 36వ వార్డులో 11 మంది, 35వ వార్డులో నలుగురు కుక్క కాట్లకు గురయ్యారు. ఇందులో ఐదుగురు పిల్లలు, ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

**బయటకు వెళ్లాలంటే భయం**

పట్టణంలోని కొత్తబస్టాండ్, జిరాయత్‌నగర్, గోల్ బంగ్లా, పోచమ్మగల్లీ, దయానంద్ నగర్, హుస్నాబాద్ కాలనీ, మామిడిపల్లి, పెర్కిట్ బస్టాండ్ ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇంటి ముందుకు పిల్లలు ఆడుకుంటే కుక్కలు ఎక్కడ దాడులు చేస్తాయే అని తల్లిదండ్రులు భయపడుతున్నారు. ప్రతి రోజు పట్టణంలో ఏదో ఒక చోట కుక్కల దాడి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపల్ అధికారుల లెక్క ప్రకారం పట్టణంలో 1400పైన కుక్కలు ఉన్నాయి.



చిన్నారి కాలుపై కుక్క కాట్లు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

**అధికారులు చర్యలు చేపట్టాలి**



కుక్కల బెడద నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలి. బయటకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు వీలైనంత త్వరగా కుక్కలను పట్టించాలి.

– రంజిత్, హుస్నాబాద్ కాలనీ, ఆర్మూర్

# చాయ్‌వాలా ఇంట చదువుల పంట!

- టీ అమ్మి సంతానాన్ని తీర్చిదిద్దిన తల్లిదండ్రులు
- కన్నవారి కలలను నెరవేర్చిన పిల్లలు

తల్లిదండ్రులకు పిల్లలే లోకం. వారి ఉన్నతికోసం నిరంతరం శ్రమిస్తారు. తమ కష్టం పిల్లలు పడకూడదన్న ఉద్దేశంతో.. వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడానికి ఎంతటి కష్టాన్నైనా భరిస్తారు. కన్నవారి కలలను నిజం చేస్తూ కొందరు విజయాలు సాధిస్తారు. జిల్లాలో పలువురు చాయ్ విక్రయించి కుటుంబాలను పోషిస్తూ.. పిల్లలను ప్రయోజకులను చేశారు. వారి విజయగాథలపై సండే స్పెషల్.. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

సండే స్పెషల్



### ముగ్గురూ ఉన్నత స్థానాల్లో..



భార్య, పిల్లలతో పున్నంసింగ్

సిరికొండ మండలం పాకాల తండాకు చెందిన పున్నం సింగ్ ఇంటర్ చదివాడు. బతుకుదెరువు కోసం పాతికేళ్ల క్రితం కామారెడ్డికి వచ్చాడు. పెట్రోల్ బంక్‌లో, సినిమా టాకీస్‌లో, ఓ కార్యాలయంలో పనిచేశాడు. ఆయన భార్య కళావతి ప్రైవేట్ టీచర్‌గా పనిచేసింది. వాళ్లకు ముగ్గురు కుమారులు. వారికి మంచి భవిష్యత్ ఇవ్వాలనుకున్న పున్నంసింగ్.. అక్కడా ఇక్కడా పనిచేయడం మానేసి.. ఇంట్లో చాయ్ తయారు చేసుకుని ఫ్లాస్క్‌లో పోసుకుని దుకాణాలు, కార్యాలయాలకు వెళ్లి విక్రయించడం ప్రారంభించాడు. ఆ డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటూనే పిల్లలను చదివించాడు. పెద్దకుమారుడు కిరణ్‌కుమార్ హైదరాబాద్‌లో బీటెక్, రాయ్‌పూర్ ఎన్‌ఐటీలో ఎంటెక్ పూర్తి చేశాడు. ప్రస్తుతం నిజామాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కుమారుడు కరుణ్‌కుమార్ బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్, ఇండోర్ ఐఐఎంలో ఎంబీఏ చదివాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. మూడో కుమారుడు కల్యాణ్‌కుమార్ ఖరగ్‌పూర్ ఐఐటీలో చదివి, లక్నోలో సాఫ్ట్‌వేర్‌గా చేస్తున్నాడు. కుమారులు ఉన్నత స్థానాలకు చేరినందుకు ఆనందంగా ఉందని పున్నంసింగ్ చెబుతున్నాడు.

### పిల్లలను ప్రయోజకులను చేసి..



కుటుంబంతో సిద్దాగౌడ్

బీబీపేట మండల కేంద్రానికి చెందిన రత్నగారి లక్ష్మి, సిద్దాగౌడ్ దంపతులు గ్రామంలో పాతికేళ్లుగా టీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి బాలకృష్ణాగౌడ్, పరశురాంగౌడ్, నాగరాణి సంతానం. ముగ్గురినీ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివించాడు. పెద్ద కుమారుడు బాలకృష్ణాగౌడ్ ఉన్నత విద్యాభ్యాసం చేసి పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించి భిక్కనూరు మండలం గుర్జకుంటలో పని చేస్తున్నాడు. రెండో కుమారుడు పరశురాంగౌడ్ చార్టెడ్ అకౌంటెంట్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తూ, సొంత కంపెనీ కూడా నిర్వహిస్తున్నాడు. ఎంబీఏ పూర్తి చేసిన కూతురు నాగరాణి ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉంది. సంతానం ప్రయోజకులు కావడంతో సిద్దాగౌడ్ సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

### పాతికేళ్ల కష్టానికి ఫలితం

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన గూడ సిద్దిరాములు పాతికేళ్లుగా చాయ్ అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య రాజేశ్వరి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. చాయ్ అమ్ముతూ పిల్లల్ని చదివించాడు. పెద్ద కుమారుడు శివప్రసాద్ బీటెక్ పూర్తి చేసి చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు సిద్దేశ్వర్ డిగ్రీ చదివి మార్కెటింగ్ రంగంలో ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు శిరీషను కూడా చదివించి పెళ్లి చేశాడు. చాయ్ హోటల్ తనకు బతుకునిచ్చిందని చెబుతాడు సిద్దిరాములు. పిల్లలు ఎవరి పనుల్లో వారు స్థిరపడినా, ఆయన మాత్రం ఇప్పటికీ టీ స్టాల్ నిర్వహిస్తున్నారు.

## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ జిల్లాలో పారలీగల్‌ వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎల్‌ఎస్‌ఏ(జిల్లా న్యాయ సేవాధికార సంస్థ) సూపరింటెండెంట్‌ శైలజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, రిటైర్డ్‌ ఉద్యోగులు, ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎన్జీవోలు, ఎంఎస్‌డబ్ల్యూ చేసిన వారు, డాక్టర్లు ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### 11న ఎక్సైజ్‌ ఆఫీస్‌లో వాహనాల వేలం

ఖలీల్‌వాడి: ఈనెల 11వ తేదీన ఎక్సైజ్‌ కార్యాలయం ఆవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను జిల్లా ప్రొహిబిషన్‌, ఎక్సైజ్‌ అధికారి డి.చంద్రభాన్‌నాయక్‌ సమక్షంలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్‌ ఎస్‌హెచ్‌వో దిలీప్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు వేలం ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్నవారు ఈఎండీ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలం వేసే వాహనాల వివరాలు తెలుసుకోవాలనుకునే వారు ఎక్సైజ్‌ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: మహారాష్ట్రలో ఆదివారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో జి ల్లాకు చెందిన శాన్విరెడ్డి రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఎస్‌జీఎఫ్‌ అండర్‌–14 రాష్ట్ర కబడ్డీ పోటీలు యాదాద్రి జిల్లాలో నిర్వహించగా, శాన్విరెడ్డి ఉత్తమ ప్రతిభకనబర్చి జాతీయస్థాయికి ఎంపికైంది.నగరంలోని సెయింట్‌ జూడ్స్‌ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న శాన్వీతోపాటు పీఈటీలు సుమన్‌, కిశోర్‌ను ప్రిన్సిపాల్‌ రాణి అభినందించారు.

## ముఖం చాటేసిన వడ్ల వ్యాపారి

- రైతులకు రూ.35లక్షలు ఇవ్వకుండా అజ్ఞాతంలోకి..
- డొంకేశ్వర్‌ మండలంలో ఘటన

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): వ్యాపారిని నమ్ముకున్న రైతులు ఇబ్బందులుపడుతున్నారు. వడ్లు కొనుగోలు చేసిన సదరు వ్యాపారి రైతులకు ఇవ్వాల్సిన సుమారు రూ.35లక్షలు ఇవ్వకుండా ముఖం చాటేయడంతో ఇటీవల పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన డొంకేశ్వర్‌ మండలంలోని ఓ గ్రామంలో చోటు చేసుకుంది. పంట కోత లు పూర్తయిన సమయంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు కాకపోవడం, ఆ సమయంలో ప్రభుత్వం బోనస్‌ ఇవ్వకపోవడంతో రైతులు ఓ వ్యాపారికి ధాన్యం విక్రయించారు. పది రోజులకే డబ్బులు ఇస్తానని సదరు వ్యాపారి రైతులకు బాండ్‌ పేపర్‌ కూడా రాసిచ్చాడు. దాదాపు 40 రోజులవుతున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో వ్యాపారికి ఫోన్‌ చేశారు. ఆ వ్యాపారి రైతులను మరికొన్ని రోజులు గడువు అడిగాడు. ఆ గడువు కూడా ముగియడంతో రైతులు మళ్లీ వ్యాపారికి ఫోన్‌ చేసినా స్పందించలేదు. దీంతో బాధిత రైతులు ఆందోళనకు గురై ఇటీవల పోలీస్‌ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు పోలీసులు కేసు నమోదు చేయకుండా వ్యాపారిని మందలించినట్లు తెలిసింది. పది రోజుల్లో రైతులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని చెల్లిస్తానని చెప్పడంతో రైతులు కేసు పెట్టకుండా పోలీస్‌ స్టేషన్‌ నుంచి వెనుదిరిగారు. రైతులు సుమారు మూడు లారీల వడ్లను సదరు వ్యాపారికి అమ్మినట్లు సమాచారం. కాస్త ఓపిక పట్టి ప్రభుత్వానికి అమ్మితే పంట డబ్బులతో పాటు బోనస్‌ కూడా వచ్చేదని బాధిత రైతులు వాపోతున్నారు.

# మహిమాన్విత క్షేత్రం శివదత్త ఆలయం!

- వందేళ్ల చరిత్ర కలిగిన దత్తాపూర్‌ ఆశ్రమం
- జిల్లాలోనే మొదటిదిగా గుర్తింపు
- ఔదుంబర వృక్షం ఇక్కడి ప్రత్యేకత
- నిష్టతో పూజిస్తే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం
- ఏటా దత్తజయంతి సందర్భంగా భక్తుల మాలధారణ

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): త్రిమూర్తి స్వరూపుడు, జగద్గురువైన దత్తాత్రేయుడికి ఇక్కడ ఊరంతా భక్తులే ఉన్నారు. అక్కడ దత్తాశ్రమం ఉండడంతో గ్రామానికి దత్తాపూర్‌గా పేరువచ్చింది. డొంకేశ్వర్‌ మండలంలో ఉన్న ఈ గ్రామంలో దత్త జయంతికి మూడు వారాల ముందు నుంచే భక్తుల సందడి నెలకొంటుంది. 21రోజులపాటు భక్తులు మాలలు ధరించి దీక్ష తీసుకుని దత్తాత్రేయుడికి నియమనిష్టలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యజ్ఞాలు చేస్తారు. మనసారా దేవుడిని కొలిస్తే కోరిన కొర్కెలు తీరుస్తాడని, బాధలు, అనారోగ్యం తొలగిపోతాయని విశ్వాసం. ఆశ్రమాలయంలో ఉన్న ఔదుంబర వృక్షానికి ఒక ప్రత్యేకత ఉంది. కర్నాటకలోని గానుగాపూర్‌ తర్వాత దత్తాపూర్‌లోనే ఈ వృక్షం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మేడి, రాగి, వేప కలిపి ఒకే వృక్షంగా పెరిగింది. దీని చుట్టూ ప్రదక్షిణలు చేస్తే సంతానం కలుగుతుందని దత్తాపూర్‌ గ్రామస్తులే కాకుండా ఇతర ప్రాంతాల ప్రజల్లో గట్టి నమ్మకం ఏర్పడింది. చాలా మందికి సంతానమైందని భక్తులు చెబుతున్నారు. ఔదుంబర వృక్షం(మేడి) కింద గురుచరిత్ర పారాయణ చేసినా, 108 ప్రదక్షిణలు చేసినా కష్టాలు తొలగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



గర్భాలయంలోని శివదత్త విగ్రహాలు

**స్థల పురాణం..**

వందేళ్లకు పూర్వమే మల్లికార్జున ఆశ్రమంగా వెలిసినప్పటికీ ఆతరువాత కాలంలో శివదత్త ఆశ్రమంగా మారింది. జిల్లాలోనే దత్తాత్రేయుడికి ఈ ఆశ్రమాలయం మొదటిదనే గుర్తింపు ఉంది. ఆశ్రమానికి కేదారేశ్వరయ్య స్వామి ఆస్థాన పీఠాధిపతిగా ఉండేవారు. అప్పట్లోనే మహారాష్ట్ర, కరీంనగర్‌, జగిత్యాల, భోకర్‌, ధర్మాబాద్‌, నిజామాబాద్‌ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చేవారు. కేదారేశ్వరయ్యకు పొన్న మల్లయ్య, గోనే గంగాధర్‌ అనే ఇద్దరు శిష్యులు ఉండేవారు. వీరు గురువుతో పాటు భాగవతం, ఆధ్యాత్మిక గ్రంథాలు, ప్రవచనాలను చేసేవారు. వీరు కాలం చేసిన తర్వాత ప్రణవనందపురి స్వామి ఆస్థాన గురువుగా కొనసాగారు. ఔదుంబర వృక్షం కింద ఉన్న దత్తాత్రేయుడికి ఆలయాన్ని నిర్మించాలని ప్రణవనందపురి సంకల్పించారు. భక్తుల సహకారంతో దత్తాత్రేయుడికి చెట్టు పక్కనే ఆలయ నిర్మాణాన్ని 2003లో పూర్తి చేశారు. ఇక్కడ శివలింగం, గణపతి, నంది, సుబ్రహ్మణ్యేశ్వర, హనుమాన్‌, నవగ్రహాలు కూడా ఉన్నాయి.



ఆశ్రమ ఆవరణలో మాలధారులు

### పౌర్ణమికి ఘనంగా ఉత్సవం

గ్రామంలోని పెద్దలు, పిల్లలు, యువకులు, మహిళలు సైతం ప్రతి ఏడాది విధిగా మండల, అర్థ మండల దీక్షలు చేస్తూ దత్తాత్రేయుడిని కొలుస్తూ వస్తున్నారు. దత్తజయంతి రోజున ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించి జాతరను నిర్వహిస్తారు. జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కరీంనగర్‌, జగిత్యాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తారు. ఈ నెల 15న దత్తపూర్ణిమ రోజున ఉత్సవాన్ని వైభవంగా చేపట్టేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### 21 ఏళ్లుగా మాలవేస్తున్నా..



శివదత్త ఆలయం జిల్లాలోనే ప్రత్యేకమని చెప్పొచ్చు. ఈ ఆశ్రమాలయానికి ఎంతో మహిమ ఉంది. నిష్టతో పూజించిన వారి కోరికలు నెరవేరుతాయి. త్రిమూర్తి స్వరూపుడిపై నాకు చాలా నమ్మకం ఏర్పడింది. ప్రతి ఏడాది తప్పకుండా మాలధారణ వేస్తా. ఎలాంటి ఆటంకాలు రాకుండా 21 ఏళ్లుగా దత్తదీక్ష తీసుకుంటుండడం సంతోషంగా ఉంది. – శ్రీకాంత్‌, ఆలయ ఉత్తరాధికారి

### ఊరంతా నిష్టతో ఉంటాం



ప్రతి ఏడాది దత్త జయంతికి మూడు వారాల ముందు నుంచి ఊరంతా నిష్టతో ఉండి పూజలు నిర్వహిస్తాం. ఊరి ప్రజలంతా దత్తాత్రేయ స్వామిని ఇష్ట దైవంగా కొలుస్తారు.. మాలధారణకు యువకులు ఆసక్తి చూపడం ఇతరుల్లో సైతం భక్తి భావన పెరిగే విధంగా చేస్తోంది. దత్తపూర్ణిమను ఘనంగా నిర్వహిస్తాం.

– మహేశ్‌బాబు, భక్తుడు, దత్తాపూర్‌

# ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం



విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

- తెలంగాణ కోసం కోమటిరెడ్డి పదవులు త్యాగం చేశారు
- బీజేపీ నాయకులు కేంద్రం నుంచి నిధులు తేవాలి
- పసుపు బోర్డు ఏమైందో అర్వింద్‌ను ప్రశ్నించాలి
- కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్‌ సిటీ: పదేళ్లుగా ప్రజల ఆలోచనను, దేశ పరిస్థితులను పట్టించుకోకుండా కేవలం మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ నాయకులు కాంగ్రెస్‌ ప్రజాప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందన్‌, నుడా చైర్మన్‌ కేశవేణుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్మూర్‌ ఎమ్మెల్యే, అంతర్జాతీయ స్మగ్లర్‌ పైడి రాకేశ్‌రెడ్డి మంత్రి కోమటిరెడ్డిపై సోయితప్పి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆరుసార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీగా చేసిన కోమటిరెడ్డి గురించి మాట్లాడే స్థాయి రాకేశ్‌రెడ్డికి లేదన్నారు. తెలంగాణ కోసం పదవులు త్యాగాలు చేసిన చరిత్ర కోమటిరెడ్డిది కాగా.. ఆ సమయంలో రాకేశ్‌రెడ్డి అడవుల్లో ఎక్కడో స్మగ్లింగ్‌ చేసుకుంటున్నాడని ఘాటుగా విమర్శించారు. ఇకపై కాంగ్రెస్‌ నాయకులపై ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణకు కేంద్రం నిధులు ఎందుకు ఇవ్వడంలేదో ఢిల్లీలో కొట్లాడాలని సూచించారు. ఇద్దరు కేంద్రమంత్రులు, ఎమ్మెల్యేలున్నా తెలంగాణకు నిధులు ఎందుకు రావడంలేదని ప్రశ్నించారు. పసుపుబోర్డు ఏమైందని బీజేపీ ఎంపీని ప్రశ్నించాలని రాకేశ్‌రెడ్డికి సూచించారు. అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ను పార్టీలో ఎవరూ పట్టించుకోవడం లేదని, దాంతో ఆయన నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడన్నారు. ఆయన అర్బన్‌ అభివృద్ధిపై మాట్లాడితే బాగుంటుందన్నారు. జిల్లా మీద అభిమానంతోనే సీఎం రేవంత్‌రెడ్డి మూడు ఇంటిగ్రేటెడ్‌ పాఠశాలలు మంజూరుచేశారని గుర్తుచేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ అంతిరెడ్డి రాజారెడ్డి, నాయకులు జావేద్‌ అక్రమ్‌, రత్నాకర్‌, బోర్గాం శ్రీనివాస్‌, కేశ మహేశ్‌, నరేందర్‌సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి



మాట్లాడుతున్న వేణుగోపాలాచారి

పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో కేసీఆర్‌ హామీలిచ్చి మర్చిపోతే ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని మాజీ పార్లమెంట్‌ సభ్యులు, పార్టీ అబ్జర్వర్‌ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఎన్నో హామీలు అమలుపరిచామని, నాలుగేళ్లలో పూర్తిస్థాయిలో హామీలు, సంక్షేమ పథకాలు అమలుచేసి తీరతామని అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలన్నారు.

### ధన్‌పాల్‌ ఏం చేశారో చెప్పాలి

ఏడాది కాలంలో అర్బన్‌ ఎమ్మెల్యేగా ధన్‌పాల్‌సూర్యనారాయణగుప్తా ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని సవాల్‌ విసిరారు. కాంగ్రెస్‌పై విమర్శలు చేసేముందు కేంద్రం ఏమి చేస్తోందో తెలుసుకోవాలన్నారు. నిజామాబాద్‌కు స్మార్ట్‌ సిటీ ఏమైందని ప్రశ్నించారు. తాగునీటి వసతి, యూజీడీ పనుల కోసం కేంద్రం నుంచి తామే నిధులు అసత్యాలు ప్రచారంచేసుకుంటున్నారని మండిపడ్డారు. రాజకీయాలు మాని నిజామాబాద్‌ అభివృద్ధిపై అర్బన్‌ఎమ్మెల్యే దృష్టిపెట్టాలని హితువు పలికారు.

# రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శనలు

నిజామాబాద్‌అర్బన్‌ : జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఎస్‌ పాఠశాలలో రెండురోజులపాటు కొనసాగిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌ శనివారం ముగిసింది. ఇన్‌స్పైర్‌లో 13, సైన్స్‌ ఫెయిర్‌లో 14 ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు డీఈవో అశోక్‌ తెలిపారు. ఎంపికైన ప్రదర్శనలు ఇవి.. ముప్కాల్‌ మండలం రెంజర్ల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు అంకిత, వై శాంతి ప్రదర్శించిన ఫుడ్‌ హెల్త్‌ హైజినిక్‌, నందిపేట మండలం బాద్గుణ జిల్లా పరిషత్‌ పాఠశాల విద్యార్థులు గగన్‌, డి కార్తీక్‌ ప్రదర్శించిన ట్రాన్స్‌ఫార్మర్‌ అండ్‌ కమ్యూనికేషన్‌, ఆర్మూర్‌ నలంద హై స్కూల్‌ విద్యార్థులు సహస్ర, శ్రీలక్ష్మి ప్రదర్శించిన నాచురల్‌ ఫార్మింగ్‌, జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎస్‌ఆర్‌ డిస్కవరీ పాఠశాల విద్యార్థులు సుబియాఇరామ్‌, కవాశ్‌శర్మ ప్రదర్శించిన డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌, మోపాల్‌ మండలం కంజర జిల్లా పరిషత్‌ పాఠశాల విద్యార్థులు నవదీప్‌, సాయివంశీ ప్రదర్శించిన మ్యాథమెటికల్‌ మోడలింగ్‌ అండ్‌ కాంపోజిషన్‌ థింకింగ్‌, విజయ హై స్కూల్‌ (నిజామాబాద్‌) విద్యార్థులు ప్రదర్శించిన విజితేంద్రీయ, శ్రీకర్‌ ప్రదర్శించిన వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌, ఎడపల్లిలోని తెలంగాణ రెసిడెన్షియల్‌ గురుకుల పాఠశాల విద్యార్థులు జ్ఞానప్రియ, సంస్కృతి ప్రదర్శించిన రిసోర్స్‌ మేనేజ్‌మెంట్‌ అంశాలు ఎంపికయ్యాయి.



కాకతీయ ఒలంపియాడ్‌ స్కూల్‌ విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో అశోక్‌, అధికారులు

**జూనియర్‌ విభాగంలో..**

ఆర్మూర్‌ టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ విద్యార్థులు విష్ణుశ్‌, చరణ్‌ ప్రదర్శించిన ఫుడ్‌ అండ్‌ హెల్త్‌ హైజినిక్‌, డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌ జిల్లా పరిషత్‌ విద్యార్థులు నవనీత్‌, రాము ప్రదర్శించిన ట్రాన్స్‌ఫార్మర్‌ అండ్‌ కమ్యూనికేషన్‌, నిర్మల హృదయ హై స్కూల్‌ విద్యార్థులు రితిక, ఫాతిమా ప్రదర్శించిన న్యాచురల్‌ ఫార్మింగ్‌, కాకతీయ ఒలంపియాడ్‌ విద్యార్థులు శ్రీమాన్య, ఎం బామిని ప్రదర్శించిన డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌, ఎడపల్లి జిల్లా పరిషత్‌ పాఠశాల విద్యార్థులు స్నేహిత, మధు శ్రీ ప్రదర్శించిన మ్యాథమెటికల్‌ మోడలింగ్‌ అండ్‌ కాంపోజిషనల్‌ థింకింగ్‌, నందిపేట కేజీబీవీ విద్యార్థులు రసజ్ఞ, గంగోత్రి ప్రదర్శించిన వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌, ఎస్‌ఎఫ్‌ఎస్‌ పాఠశాల విద్యార్థులు రిషి, జెస్సికా ప్రదర్శించిన రిసోర్స్‌ మేనేజ్‌మెంట్‌ ప్రదర్శనలు ఎంపికయ్యాయి.

### ఇన్‌స్పైర్‌ విభాగంలో..

జిల్లా కేంద్రంలోని నూతన వైశ్య పాఠశాల విద్యార్థి శివమణి, జిల్లా కేంద్రంలోని విజయ్‌ పబ్లిక్‌ స్కూల్‌ విద్యార్థి రోహన్‌రెడ్డి, జిల్లా పరిషత్‌ పాఠశాల(నడ్కుడ) విద్యార్థి పూ, ఉన్నత పాఠశాల(వన్నెల్‌ బి) విద్యార్థి రాజారపు రితీశ్‌, టీఎస్‌ మోడల్‌ పాఠశాల విద్యార్థి ప్రాంజలి, చిట్టాపూర్‌, లక్మాపూర్‌, తిర్మన్‌పల్లి, కుకునూర్‌ జెడ్పీ హైస్కూల్‌ల విద్యార్థులు గోపిడి వైష్ణవి, పోలపల్లి నాగలక్ష్మి, రమ్య, దీకొండ మీనాక్షి, కేజీబీవీ(కోటగిరి)కి చెందిన మోగావత్‌ కళ్యాణి, లిటిల్‌ ఫ్లవర్‌ స్కూల్‌ విద్యార్థి అంకంపల్లి ఇందుప్రియ, సత్యశోధక్‌ పాఠశాల విద్యార్థి మలావత్‌ సుశాంత్‌ ఇన్‌స్పైర్‌ విభాగంలో రాష్ట్రస్థాయి ఎంపికయ్యారు.

# సర్వేకు డుమ్మాకొట్టిన ఆర్‌పీలకు మెమోలు?

- విచారించిన మెప్మా పీడీ రాజేందర్‌
- మెమోలు తీసుకునేందుకు ఆర్‌పీల విముఖత
- చర్యలు తప్పవని హెచ్చరించిన పీడీ

నిజామాబాద్‌ సిటీ: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో డుమ్మా కొట్టిన ఆర్‌పీలను మెప్మా పీడీ కలెక్టరేట్‌ ఆవరణలోని తన కార్యాలయానికి పిలిపించి విచారించారు. సర్వేలో పాల్గొనని 29 మంది నుంచి వివరణ తీసుకున్నారు. డ్యూటీలు చేయాల్సిందేనని మున్సిపల్‌ కమిషనర్‌ దిలీప్‌ లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీచేసినా వాటిని బేఖాతరు చేస్తూ సర్వేకు కొందరు ఆర్‌పీలు డుమ్మాకొట్టారు. దీంతో ఆర్‌పీలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్‌ కమిషనర్‌ మెప్మా పీడీ రాజేందర్‌కు లేఖ రాశారు. అనారోగ్య కారణాల వల్ల తాము సర్వే చేయలేదని కొందరు ఆర్‌పీలు వివరణ ఇచ్చారు. అయితే కొందరు మాత్రం తమకు గతంలో సర్వే చేసిన వాటికి హానరోరియం (గౌరవ వేతనం) ఇవ్వలేదని పీడీకి వివరించారు.

ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే చేయని ఆర్‌పీలకు మెమోలు ఇస్తున్నట్లు పీడీ రాజేందర్‌ తెలిపారు. అయితే కొందరు ఆర్‌పీలు మాత్రం మెమోలు తీసుకోలేదు. మెమోలు ఇవ్వాలనుకుంటే తమ సమాఖ్య సంఘాలకు ఇవ్వాలి తప్ప వ్యక్తిగతంగా తమకు ఇస్తే తీసుకోమని ఖరాఖండిగా తేల్చిచెప్పారు. తాము ఇప్పటి వరకు 51 రకాల సర్వేలు చేశామని, గత 6 నెలలుగా తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.4 వేలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఇప్పించాలని పీడీ రాజేందర్‌ను కోరారు.

### సైనిక సంక్షేమశాఖకు అవార్డు

నిజామాబాద్‌ నాగారం: గతేడాది సాయుధ దళాల దినోత్సవం సందర్భంగా అత్యధికంగా విరాళాలు సేకరించినందుకు జిల్లా అధికారి రమేశ్‌, ఉద్యోగులు రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా శనివారం అవార్డును శనివారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని గవర్నర్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్‌ అసిస్టెంట్‌ గంగామోహన్‌, ఉమేర్‌ పాల్గొన్నారు.





## విద్యుత్‌ అధికారుల స్పెషల్‌ డ్రైవ్‌

- వ్యవసాయ కనెక్షన్‌ సర్‌చార్జీల వసూలు
- జిల్లాలో లక్ష్యం రూ.6.30 కోట్లు



మోర్తాడ్‌లో విద్యుత్‌ సర్‌చార్జీలు వసూలు చేస్తున్న ఉద్యోగులు

మోర్తాడ్‌(బాల్కొండ): వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ సరఫరా చేస్తున్నా ఒక్కో కనెక్షన్‌కు ప్రతి నెలా రూ.30 చొప్పున ఏడాదికి రూ.360 వసూలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. సర్‌చార్జీలను ప్రతి ఏడాదిలో డిసెంబర్‌లో వసూలు చేస్తారు. ఈ ఏడాది సర్‌ చార్జి వసూలు కోసం విద్యుత్‌ అధికారులు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నారు. రైతుల చెంతకే వెళ్లి ఒక్కో కనెక్షన్‌కు సర్‌చార్జీని వసూలు చేసి రసీదు అందిస్తున్నారు. జిల్లాలో 1.75లక్షల విద్యుత్‌ కనెక్షన్‌లు ఉండగా వీటి సర్‌చార్జీలను పూర్తి స్థాయిలో ఈనెలాఖరులోగా వసూలు చేయాల్సి ఉంది. సర్‌చార్జీలతో ఎన్‌పీడీసీఎల్‌కు రూ.6.30 కోట్ల ఆదాయం లభించనుంది. జిల్లాలో ఎక్కువ వ్యవసాయ క్షేత్రాలకు బోరు మోటార్ల ద్వారానే సాగునీటిని అందిస్తారు. సర్‌చార్జీల వసూళ్ల కోసం రోజుకో గ్రామంలో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నామని భీమ్‌గల్‌, మోర్తాడ్‌ సబ్‌ డివిజన్‌ల ఏడీఈ వినోద్‌కుమార్‌ తెలిపారు. రైతులు సహకరించి సర్‌చార్జీలను చెల్లించాలని ఆయన కోరారు.

## పోలింగ్‌ స్టేషన్ల డ్రాఫ్ట్‌ విడుదల



సుభాష్‌నగర్‌ : జిల్లాలోని 27 మండలాల్లో పోలింగ్‌ స్టేషన్ల డ్రాఫ్ట్‌ పబ్లికేషన్‌ శనివారం ఆయా మండలాల కేంద్రాల్లో ఎంపీడీవోలు విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 27 మండలాలు, 545 గ్రామపంచాయతీలు, 5,022 వార్డు స్థానాలు, 5053 పోలింగ్‌ స్టేషన్లు ఉన్నాయి. పోలింగ్‌ స్టేషన్లపై 10న జిల్లాస్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో, 12న మండల స్థాయిలో సమావేశం ఉంటుందని ఇన్‌చార్జి డీపీవో శివకృష్ణ తెలిపారు. 13న పోలింగ్‌ స్టేషన్లపై అభ్యంతరాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

## సెల్‌ ఫోన్‌ల అప్పగింత



కామారెడ్డి టౌన్‌: దేవునిపల్లి పీఎస్‌ పరిధిలో గత మూడు నెలల కాలంలో చోరీకి గురైన మొబైల్‌ ఫోన్లను రికవరీ చేసి ఎస్‌ఐ రాజు శనివారం ఎనిమిది మందికి అప్పగించారు. సీఈఐఆర్‌ యాప్‌ ద్వారా ట్రేస్‌ చేసి ఫోన్‌లు రికవరీ చేశామని ఎస్సై తెలిపారు. శీనివాస్‌, క్రాంతి, కిరణ్‌గౌడ్‌, శంకర్‌, సాయిలు, సుధాకర్‌, గుల్మార్‌, కనకయ్య, ప్రమోద్‌లకు ఫోన్‌లను అప్పగించామన్నారు.

## క్రైం కార్నర్‌

### వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరి ఆత్మహత్య

పిట్లం(జుక్కల్‌): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కంబాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఎర్ర మీనా(25)కు శుక్రవారం రాత్రి భర్తతో గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన మీనా శనివారం ఉదయం 11గంటలకు ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి అంజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**అప్పుల బాధ తాళలేక..**

ఎల్లారెడ్డి: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని వెల్లుట్లలో శనివారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గంగారాం(46) కూతురి వివా హం చేయడంతోపాటు కొంత స్థలాన్ని కొన్నాడు. ఈ నేపథ్యంలో అప్పులై ఆ బాధ తాళలేక శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### భూవివాదంలో పరస్పర దాడులు

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌ గ్రామానికి చెందిన దాయాదులు కొట్టె కోటేశ్వర్‌, కొట్టె పోతన్నలు భూతగాదాలో శనివారం పరస్పర దాడులకు పాల్పడినట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నాళేశ్వర్‌–తుంగిని గ్రామాల శివారులోని ఎస్సారెస్పీ బ్యాక్‌ వాటర్‌ పరిధిలో తాతలకు చెందిన భూమిని కొన్ని దశాబ్దాల కిందట అప్పటి ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా, కోటేశ్వర్‌, పోతన్న ఎలాంటి పట్టా లేకుండానే ఆ భూమి కోసం కొన్నేళ్లుగా ఘర్షణ పడుతున్నారు. శనివారం ఇరువర్గాలకు చెందిన వారు పరస్పర దాడులు చేసుకున్నారు. కొందరికి గాయాలుకాగా జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### అడవి జంతువును చంపిన వ్యక్తి అరెస్టు



నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని గుండారం శివారులో ముళ్లపందిని వేటాడి చంపిన శేఖర్‌ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎఫ్‌ ఆర్‌ వో సంజయ్‌కుమార్‌ తెలిపారు. శేఖర్‌ గుండారం శివారులో ముళ్లపందిని వేటాడి దానిని కాల్చి శుభ్రం చేస్తున్నారనే సమాచారం మేరకు శనివారం ఘటనాస్థలానికి వెళ్లి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిని ఇద్దరి పూచీకత్తు తీసుకుని స్టేషన్‌ బెయిల్‌పై విడుదల చేసినట్లు తెలిపారు.

### ఎల్లారెడ్డిలో సైబర్‌ మోసం

ఎల్లారెడ్డి రూరల్‌: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ఉప్పరి పండరి సైబర్‌ మోసానికి గురైనట్లు ఎస్సై మహేశ్‌ శనివారం తెలిపారు. పండరికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌ చేసి ధనీ ఫైనాన్స్‌ నుంచి మీకు రుణం మంజూరైందని, పొందేందుకు ఆన్‌లైన్‌ చార్జీలు రూ.42వేలు చెల్లించాలని సూచించడంతో పండరి డబ్బులు పంపాడు. ఆ తరువాత అవతలి వ్యక్తి ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ రావడంతో పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

### పీడీఎస్‌ బియ్యం పట్టివేత



ధర్పల్లి: మండల కేంద్రంలోని ఎన్టీఆర్‌ కాలనీలో పీడీఎస్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు కాలనీలోని ఓ ఇంటిపై దాడి చేయగా 9.9 క్వింటాళ్ల పీడీ ఎస్‌ బియ్యం పట్టుబడిందని, బియ్యం నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్‌లో విద్యుత్‌షాక్‌తో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన బాణాల మహిపాల్‌ గేదెను రోజులాగే వ్యవసాయ బావి వద్ద షెడ్డులో కట్టేసి ఇంటికి వచ్చాడు. తెల్లవారుజామున బావి వద్దకు వెళ్లేసరికి సమీపంలో గేదె మృతి చెంది కనిపించింది. కట్టను ఊడదీసుకుని మేత మేసేందుకు వెళ్లి విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు మహిపాల్‌ తెలిపారు. ఘటనా స్థలాన్ని విద్యుత్‌ లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ నగేశ్‌, వైద్యాధికారిణి అనూష, పశుగణ సహాయకురాలు అహల్య సందర్శించారు.